క్లుప్తంగా

తహసీల్దార్‌గా చిన్నారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన చిన్నారావు

జియ్యమ్మవలస: మండల తహసీల్దార్‌గా చిన్నారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రేగిడి మండలంలో విధులు నిర్వరిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలతో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సారా పట్టివేత

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): కురుపాంలోని ఎస్సీ వీధిలో 20లీటర్ల సారాతో ఇద్దరిని అదుపులోకి తీసుకొన్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గ్రామంలో నవోదయం 2.0లో భాగంగా దాడులు నిర్వహించగా రాయిపల్లి ప్రవీణ్ కుమార్, రాయిపల్లి అప్పారావు సారాను తరలిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఒకరిని అదుపులోకి తీసుకొగా మరొకరు తప్పించుకొన్నారన్నారు. ఇందులో రాయిపల్లి ప్రవీణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించినట్లు తెలిపారు. దాడులలో సిబ్బంది జె.రాజశేఖర్, ఆర్.చంద్రకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మితమైన లక్ష్మీనృసింహ స్వామికి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ముడుపుల పూజలు ఘనంగా జరిగాయి. స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నిరుపేద కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి వితరణ అందిస్తున్న సంజీవినాయుడు

బలిజిపేట: పెదపెంకి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి రూ.10,200లు వితరణగా అందించామని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు సంజీవినాయుడు తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు గ్రామంలో తిరిగి ఈ మొత్తాన్ని సేకరించామని చెప్పారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జీవనోపాధికి కష్టంగా ఉండడంతో దీనిని తెలుసుకుని యువకుల సహకారంతో గ్రామంలో అందరిని కలిసి విషయాన్ని వివరించగా యువకులు, పెద్దలు అందరు ఇచ్చిన వితరణ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందించామన్నారు. కార్యక్రమంలో పి.భాస్కర్, యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రగతి సాధించాలి



జాతిపిత గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులు

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలందించి పల్లెలు ప్రగతి పథంలో నడిపేందుకు ప్రతీ ఒక్క అధికారి కృషి చేయాలని డీఎల్‌డీఓ జీవీ రమణమూర్తి అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం పార్వతీపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు మండల ప్రజా పరిషత్ సిబ్బందితో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పాలన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని గ్రామీణాభివృద్ధి ప్రోత్సహించడంలో, సామాజిక సాధికారతలో వీటి పాత్రలను ప్రజలకు కూడా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.

నియామకం

పాలకొండ రూరల్: పాలకొండ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ పార్టీ అధ్యక్షుల జాబితాను పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం గురువారం విడుదల చేసింది. పాలకొండ నగరపంచాయతీ అధ్యక్షుడిగా వెలమల మన్మధరావు, మండల అధ్యక్షుడిగా కనపాక సూర్యప్రకాష్‌లను నియమించారు. భామిని మండల అధ్యక్షుడిగా బోదెపు శ్రీనివాసరావు.. వీరఘట్టం మండల అధ్యక్షుడిగా దమలపాటి వెంకటరమణనాయుడులను నియమించారు. వీరిని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతి తదితరులు అభినందించారు.

సరదాల మాటున ప్రమాదాలు



తోటపల్లి కుడి కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు

గరుగుబిల్లి: విద్యా శాఖ పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించింది. దీంతో ఎక్కువ సమయం పిల్లలు ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. తల్లిదండ్రులు ఎంతచెప్పినా వినకుండా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి హాయిగా గడపాలనుకుంటున్నారు. ఈ ఆనంద సమయాల్లో ఎన్నో అనర్థాలు పొంచి ఉన్నాయనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించి ఒక కంట కనిపెట్టాలి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, పిల్లలు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంటుంది. ఇంతవరకు పాఠశాలలో చదువులతో గడిపిన విద్యార్థులకు పాఠశాలలకు సెలవులు కావడంతో వారి ఆనందానికి హద్దు ఉండదు. చిన్నారులు ఇంటికి పరిమితం కాకుండా తోటి పిల్లలు, స్నేహితులతో కలసి ఆడుకోవడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. వేసవిలో ఎండకు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉంది. పిల్లలను ఇంటి ఆవరణలో, పరిసర ప్రాంతంలో ఆడుకునేలా, చదువుకునేలా తల్లిదండ్రులు అవసరమైన చర్యలు చేపట్టాలి. మధ్యాహ్న సమయంలో వారిని ఇంటిపట్టునే ఉండేలా చూడాలి.

వాహనాలతో జాగ్రత్త

ద్విచక్ర వాహనాలు, సైకిళ్లంటే పిల్లలకు మోజు ఎక్కువ. ఇంట్లో చెప్పకుండా వాటిని నడుపుతూ రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చిన్నారులను మోటారు బైక్‌లు, సైకిళ్లకు దూరంగా ఉంచాలి. అవసరమైతేనే పెద్దల పర్యవేక్షణలో వాహనాలు నడపడం నేర్పించాలి. పిల్లలను ఎక్కువ సమయం ఎండలో తిరిగితే ఒక్కోసారి అనారోగ్యానికి గురవ్వవచ్చు.

- చెరువులు, నేల బావులు, నిర్మాణాలు, గుంతల వైపు వెళ్లనీయొద్దు..
- వేసవి సెలవుల్లో పిల్లలపై దృష్టి పెట్టండి



ఎస్‌ఆర్ పేటలో క్రికెట్ ఆడుతున్న విద్యార్థులు

తల్లిదండ్రులు పర్యవేక్షించాలి

పిల్లలపై కోపగించుకోకుండా ప్రేమతో వారిని దగ్గరికి తీసుకోవాలి. వడదెబ్బ తగలకుండా పిల్లలను వీలైనంతవరకు ఇంట్లో ఉండే విధంగా కుటుంబ సభ్యులు పర్యవేక్షణ చేయాలి. ఎక్కువ శాతం ఇంట్లో తయారు చేసే పదార్థాలు మాత్రమే పిల్లలకు ఆహారంగా తీసుకునేందుకు సిద్ధం చేయాలి. బయట దొరికే పదార్థాలను పిల్లలకు అలవాటు చేస్తే రోగాల బారిన పడే అవకాశం ఉంది.

– దత్తి అప్పలనాయుడు, ఎంఈఓ, గరుగుబిల్లి

సెల్‌ఫోన్‌లకు బానిసలుగా..

సెల్‌ఫోన్‌లలో కార్టూన్ వీడియోలు చూస్తూ స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లకు బానిసలుగా మారుతున్నారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్‌ల పిచ్చి పట్టుకునే ప్రమాదం ఉంది. ఇది చిన్న పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు మారాం చేస్తున్నారని పెద్దలు ఫోన్లు ఇవ్వడం అలవాటు చేస్తున్నారు. రాను రాను ఇది పెద్ద సమస్యలా మారుతుంది. ఎంతలా అంటే ఫోన్ లేకపోతే తిండి కూడా తినడం లేదు. ఇది పిల్లల మానసిక ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఇలా స్మార్ట్ ఫోన్లు వాడుతూ ఉంటే పిల్లలు ఆందోళన, నిరాశకు గురయ్యే ప్రమాదం ఉంది.

కాలువలు, చెరువులతో ప్రమాదాలు

వేసవి కాలంలో ఎండ తీవ్రతను తాళలేక పిల్లలు ఈతపై సరదా చూపుతూ ప్రమాదాలకు గురవుతుంటారు. వీలైనంత వరకు పిల్లలను చెరువులు, కాలువలు, బావుల వద్దకు పంపకూడదు. ఈత నేర్వాలనుకుంటే తల్లిదండ్రులే పిల్లలను వెంట తీసుకెళ్లి కొంత సమయం వరకు ఈత నేర్పటం ఉత్తమం. అలాగే నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదకరమైన గుంతలు ఉంటాయి ఆదమరిచి ఆటల్లో పడి పిల్లలు గుంతల్లో పడే ప్రమాదాలు ఉంటాయి.

ధ్యానం జీవితంలో భాగం కావాలి



ధ్యానం ఆవశ్యకతపై వివరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి మురళి

గరుగుబిల్లి: మారుతున్న జీవన విధానంలో ప్రతీ ఒక్కరి జీవితంలో ధ్యానం ఒక భాగం కావాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ ట్రైనర్ జె.మురళి అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో ధ్యాన కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనుల ఒత్తిడితో మానసిక ప్రశాంతత లేకపోవడంతోనే పలు రుగ్మతలు వస్తున్నాయన్నారు. ప్రతీ నిత్యం కొంత సమయం ధ్యానం చేస్తే రుగ్మతల నుంచి బయట పడవచ్చునన్నారు. ఒత్తిడిని జయించాలంటే ధ్యాన మొక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా సంతోషపురం, గిజబ, గౌరీపురం, తోటపల్లి గ్రామాల్లో ధ్యానోత్సవ కార్యక్రమాలను నిర్వహించి ధ్యానం వల్ల వచ్చే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అప్పలనాయుడు, శ్రీధర్ నాయుడు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్‌ల ఏర్పాటుకు పరిశీలన



నదీ తీరం వద్ద సరిహద్దులు పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ: మండలంలోని చిన మంగళాపురం గ్రామ పరిధిలోని నాగావళి నది వద్ద ఇసుక ర్యాంప్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు గురువారం స్థల పరిశీలన చేపట్టారు. తహసీల్దార్ బాలమురళీ కృష్ణ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది నదీ తీరంలో ఇసుక మేటలను పరిశీలించారు. ర్యాంప్ ఏర్పాటుతో పాటు ఇసుక డంప్ చేసి లోడ్ చేసుకునే విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మైనింగ్ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తహసీల్దార్ బాలమురళీకృష్ణ తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం



గృహమంజూరు పత్రాలు అందజేస్తున్న పీడీ ధర్మచంద్రారెడ్డి

సీతంపేట: గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని పెదరామ, వాబ, మొగధార గూడ గ్రామాలను గురువారం సందర్శించారు. పీఎంఏవై, పీఎం జన్‌మన్ లబ్ధిదారులకు గృహమంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణాలు త్వరగా చేపడితే బిల్లులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.కృష్ణారావు, తహసీల్దార్ అప్పలరాజు, హౌసింగ్ ఏఈ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన..

భామిని మండలం బాలేరు సచివాలయంలో యాస్పిరేషనల్ బ్లాక్ ప్రొగ్రాం కింద చేపడుతున్న కార్యక్రమాలపై నీతి అయోగ్ ప్రతినిధి రామయ్య విద్యార్థులకు వివరించారు. జేసీఎస్ కో ఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ మాట్లాడుతూ... పలు సూచనలు చేశారు. సూచించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ మధు, ఉపాధి ఎఫ్‌ఏ బాలకృష్ణ, హైస్కూల్ టీచర్ కొండగొర్రి మిన్నారావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. – భామిని



కొవ్వొత్తుల ప్రదర్శన ..

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రముష్కరుల దాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలంటూ శిలిగాం గ్రామస్తులు గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. – సీతంపేట



రాయితీపై యంత్ర పరికరాలు

వ్యవసాయంలో యంత్రాల వినియోగం వల్ల అధిక ఉత్పత్తులు వస్తాయని.. ఈ నేపథ్యంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ కమిషనర్ ఎ.డి ఎస్‌వీ రమేష్, వ్యవసాయాధికారి శివరామకృష్ణ తెలిపారు. భామిని, నులకజోడు గ్రామాల్లో రైతులకు అందజేసిన యంత్రాలను మండల వ్యవసాయాధికారి కె. సింహాచలంతో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు బిడ్డిక ప్రసాదరావు, భూపతి ప్రభాకరరావు, వ్యవసాయ సహాయకులు సందీప్, ఎర్రన్న, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు. – భామిని

ఉగ్రవాదాన్ని అణచివేయాలి



వీరఘట్టం: కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ,కూటమి నాయకులు

పాలకొండ రూరల్: దేశంలో కల్లోలం సృష్టించే ఉగ్రవాదాన్ని సమూలంగా అణచివేయాలని టీకే రాజపురం గ్రామస్తులు నినదించారు.

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ గ్రామంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అలాగే పాలకొండ పట్టణంలో బీజేపీ నాయకుల నేతృత్వంలో కోటదుర్గమ్మ దేవస్థానం వద్ద క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. ఈ క్రమంలో వక్తలు మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు.

వీరఘట్టంలో..

వీరఘట్టం: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ నివాళులర్పించారు. ఈ మేరకు కూటమి నాయకులతో కలసి వీరఘట్టం ప్రధాన రహదారిలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ఆయనతో పాటు కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయాన ఉదయ్‌భాస్కర్, పాదిలాపు కృష్ణమూర్తినాయుడు, మాచర్ల అనిల్‌బాబు, బల్ల హరిబాబు, తూముల రమేష్, వెలగాడ శ్రీను, మత్స పుండరీకం, తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ రూరల్: టీకే.రాజపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపడుతున్న గ్రామస్తులు



పాలకొండ రూరల్: కోటదురగమ్మ దేవస్థానం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

స్థానిక పరిపాలనలో పీఆర్ శాఖ కీలకం



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

గరుగుబిల్లి: స్థానిక పరిపాలనలో పంచాయతీరాజ్ శాఖ కీలకమని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వశక్తిని కలిగించడం, స్థానిక సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకుగాను ఈ వ్యవస్థను రూపొందించడం జరిగిందన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలను అందించిన కార్యాలయ సిబ్బందికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.అర్జునరావు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలన కీలకం..

- ఎంపీడీఓ వెంకటరమణ



మండల పరిషత్ కార్యాలయ ఏఓ వెంకటరావును సన్మానిస్తున్న ఎంపీడీఓ వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది

వీరఘట్టం: దేశాభివృద్ధిలో పంచాయతీ పాలన ఎంతో కీలకమని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో సుపరిపాలన అందిస్తే దేశం త్వరగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఏఓ దూబ వెంకటరావును ఎంపీడీఓ, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రమణమూర్తి, ఏపీఓ జి.సత్యంనాయుడు, కార్యాలయ సిబ్బంది వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు



నవగాం - వండువ మధ్య రహదారికి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాలకొండ రూరల్: పాలకొండ - వీరఘట్టం ప్రధాన రహదారిలో మలుపులు, గోతులేర్పడడంతో తరచూ సంభవిస్తున్న ప్రమాదాలపై ఇటీవల సాక్షిలో 'డేంజర్ జోన్స్' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గతంలో మంజూరైన నిధులతో 3.8 కిలోమీటర్ల మేరా పూర్తిగా ఛిద్రమైన రహదారుల్లో లేయర్ వర్క్ పనులు చేపడుతున్నట్లు సంబంధిత జేఈ కిరణ్‌కుమార్ తెలిపారు. రూ.కోటీ 18 లక్షల వ్యయంతో పాలకొండ మండలం నవగాం నుంచి వండువ మీదుగా మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

మహాత్ముల సేవలు గుర్తుంచుకోవాలి..



భామిని: మహాత్ముల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న వైస్ ఎంపీపీ ధర్మారావు, తదితరులు

భామిని: గ్రామాల అభివృద్ధికి దేశ నాయకులు, మహాత్ములు అందించిన సేవలను గుర్తుంచుకోవాలని మండల ప్రత్యేక ఆహ్వానితుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో దేశ నాయకుల చిత్ర పటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డేపల్లి ప్రసాద్, గెదెల మోహన, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థతో అభివృద్ధి..

పాలకొండ రూరల్: పంచాయతీరాజ్ వ్యవస్థతో క్షేత్రస్థాయి అభివృద్ధి ముడిపడి ఉందని ఎంపీపీ బి.భాను అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

సాలూరు రూరల్: మండలం కురుకూటి పంచాయతీ సులారి గ్రామ సమీపంలో సారా తయారీ కేంద్రాలపై గురువారం సాలూరు రూరల్ పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఉమ్మడిగా దాడి చేసి 16 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. బెల్లం ఊటతో పాటు 3 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యంత్రాల పనితీరుపై ఆరా

వీరఘట్టం: మండలంలోని తలవరం, మొట్ట వెంకటాపురం, యు.వెంకమ్మపేట, కిమ్మి, బిటివాడ, కొట్టుగుమ్మడ గ్రామాలకు చెందిన రైతులకు ఇచ్చిన నూర్పిడి యంత్రాల పనితీరుపై జిల్లా వ్యవసాయ శాఖకు చెందిన స్టాటస్టిక్స్ ఏడీఏ ఎస్‌వీ రమేష్, ఏఓ శివరామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక్కో రైతుకు రూ.2.60 లక్షల విలువ గల నూర్పిడి యంత్రాలను రూ. 80 వేల సబ్సిడీతో ఇవ్వడం జరిగిందన్నారు. రైతులు యంత్రాలను వినియోగిస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఓ జక్కువ సౌజన్య పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రత్నంరాజు

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ రత్నంరాజు గురువారం ప్రారంభించారు. కోటదుర్గమ్మ ఆలయం సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ, నగర పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వేసవి ఎండల నేపథ్యంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ టి. జయరాం, ఏఈ దేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు కచ్చితంగా రహదారి నిబంధనలు పాటించాలని రూరల్ ఎస్ఐ బి.సంతోషి సూచించారు. మండలంలోని పలు కూడళ్లలో ఆకస్మికంగా తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు.